## కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌కు ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కోట శివకృష్ణ

బెల్లంపల్లిరూరల్, జనవరి 20 : బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ ఉత్తమ విస్తరణ విభాగపు శాస్త్రవేత్తగా రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించి అవార్డు అందజేశారు. గ్రామీణ రైతుల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందని డాక్టర్ కోట శివకృష్ణ తెలిపారు. ఏరువాక సంస్థకు, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులకు, రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## 'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య
- కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈవో యాదయ్య

కాసిపేట, జనవరి 20 : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య పేర్కొన్నారు. శనివారం కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి గదిలోకి వెళ్లి బోర్డుపై విద్యార్థులతో లెక్కలు చేయించారు. అనంతరం పదో తరగతి బోధించే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, ఉపాధ్యాయుడు రమణారెడ్డి ఉన్నారు.



కలెక్టర్ హేమంత్ సహదేవరావుకు అయోధ్య అక్షింతలు అందజేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు

# కలెక్టర్‌కు అయోధ్య అక్షింతల అందజేత

ఆసిఫాబాద్, జనవరి 20 : కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుకు అయోధ్య శ్రీరాముని అక్షింతలు, ఆహ్వాన పత్రికను శ్రీ రామ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్ అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో నిర్వహించే వేడుకులకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు ఇరుకుల్ల ఆంజనేయులు, గుర్రాల వెంకన్న, కోటేశ్వర్, వేణుగోపాల్ శ్రీరాములు, రాజేశ్వర్ ఉన్నారు.

### గంగాపూర్ జాతరను ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, జనవరి 20 : రెబ్బెన మండలం గంగాపూర్‌లో వచ్చే నెల 23 నుంచి 25వ తేదీల వరకు నిర్వహించే బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి దేవాదాయ ధర్మాదాయ, పంచాయితీ రాజ్, మిషన్ భగీరథ, రెవెన్యూశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సౌకర్యాల ఏర్పాట్లపై చర్చించారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జాతరలో తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేసే విధంగా మండల పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటపతి, రెబ్బెన తహసీల్దార్ సమీర్ అహ్మద్, రెబ్బెన ఎంపీపీ జుమ్మడి సౌందర్య, జడ్పీటీసీ సంతోష్, మిషన్ భగీరథ, దేవాదాయ శాఖ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బై-లా పట్టని టీఎన్జీవో

**ఇష్టారాజ్యంగా ఆరు యూనిట్లలో ఎన్నికలకు నోటిఫికేషన్**

- యూనియన్ బై-లాలో ఉందొకటైతే.. చేసేది మరొకటి..
- సభ్యత్వ నమోదు పూర్తికాక ముందే.. ఓటర్ల జాబితా లేకుండానే ఎలక్షన్స్‌కు..
- తిరిగి పదవులు దక్కించుకునే కుట్రలంటూ ఆరోపణలు
- రాష్ట్రస్థాయి నాయకత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్న ఉద్యోగులు




మంచిర్యాల జిల్లా కేంద్రంలో టీఎన్జీవో కార్యాలయం


మంచిర్యాల, జనవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీఎన్జీవో) ఎన్నికల వ్యవహారం వివాదానికి దారితీస్తున్నది. యూనియన్ బై-లా నిబంధనలకు విరుద్ధంగా ఎలక్షన్స్‌కు వెళ్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూనియన్‌కు పునాదులు పడినప్పటి నుంచి అందులోనే పాతుకుపోయిన కొందరు లీడర్ల ఇష్టారాజ్యం.. ఇప్పుడు పరవు పోయేదాకా తీసుకువచ్చింది. యూనియన్ బై-లాకు.. మంచిర్యాల టీఎన్జీవో సంఘానికి ఏ మాత్రం సంబంధం లేదన్నట్లు కొందరు వ్యవహరిస్తున్న తీరుపై టీఎన్జీవోలోని ఇతర ఉద్యోగులే పెదవి విరుస్తున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట, మందమర్రి, కన్నెపల్లి యూనిట్ల పదవీకాలం గతేడాది నవంబర్‌లో ముగిసింది. జిల్లా కమిటీ కాలపరిమితి డిసెంబర్ చివరివారంతో అయిపోయింది. వెంటనే యూనిట్లకు ఎన్నికలు నిర్వహించి జిల్లా బాడీని ఎన్నుకోవాల్సి ఉన్నా.. వివిధ కారణాల దృష్ట్యా అది ఆలస్యమైంది. దీనిపై టీఎన్జీవోలోని మిగిలిన ఉద్యోగుల్లో అసమ్మతి పెరగడంతో హడావుడిగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఆరు యూనిట్లకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. యూనియన్ బై-లాలోని నియమాలేవీ పరిగణలోకి తీసుకోకుండా ఎన్నికలకు వెళ్లడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఆరు యూనిట్లకు సంబంధించిన ఓటర్ల జాబితాను వారం ముందే ఎన్నికల అధికారులు ప్రచురించాల్సి ఉంది. ఈ లెక్కన 28వ తేదీన ఎన్నికలు జరిగే చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి యూనిట్ల ఓటర్ల జాబితా ఇప్పటికే విడుదల కావాలి. కానీ జాబితాపై స్పష్టత లేదు. అసలు జిల్లాలో మొత్తం ఆరు యూనిట్లలో కలిపి 800 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు యూనియన్‌లో 450 మంది మాత్రమే సభ్యత్వం నమోదు చేసుకున్నారు. మిగిలిన వారి సభ్యత్వ నమోదు పూర్తి కాక ముందే.. ఓటర్ల జాబితా లేకుండానే ఎన్నికలకు వెళ్లాల్సిన అత్యవసరం ఏమొచ్చిందనే ప్రశ్న తలెత్తుతున్నది.

### జనవరి ముందే సభ్యత్వం పూర్తవ్వాలి...

యూనియన్ బై-లా రూల్-9 ప్రకారం జనవరి 1వ తేదీలోగా సభత్వ నమోదును పూర్తి చేసి మెంబర్‌షిప్ లిస్టును బహిర్గత పరచాలి. కానీ ఈ ఆరు యూనిట్ల పరిధిలో అది జరగలేదు. బై-లాకు వ్యతిరేకంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఎన్నికల ముందు రోజు వరకు సభ్యత్వం పొందేందుకు ఛాన్స్ ఉందని పత్రికా ప్రకటన విడుదల చేయడం కొసమెరుపు. దీనిపై ఆయనను వివరణ కోరగా ఎన్నికలకు మూడు రోజుల ముందు వరకు సభ్యత్వం పొందవచ్చని చెప్పారు. యూనియన్ బై-లాలో అలాగే ఉందన్నారు. అందుకు సంబంధించి ప్రతిని కోరగా అది ప్రస్తుతం అందుబాటులో లేదన్నారు. నేను తెప్పించుకొని మీకు ఇస్తామంటూ దాటవేసే ధోరణిలో సమాధానం చెప్పారు. కాగా నోటిఫికేషన్‌లో ఎన్నికల తేదీలు, ఎన్నికల అధికారుల వివరాలను మాత్రమే పేర్కొన్నారు. ఎన్నిక నిర్వహించే సమయం, కౌంటింగ్ సమయం ఇవేవీ అందులో ఇవ్వలేదు. చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి మూడు యూనిట్ల ఎన్నికలు ఒకే రోజు నిర్వహించడం వెనుక మతలబు ఏమిటోనన్న ప్రశ్న తలెత్తుతున్నది. మంచిర్యాలలో టీఎన్జీవో సంఘం ఎన్నిక ఇప్పటి వరకు ఏకగ్రీవంగానే జరిగింది. ఇప్పుడు టీఎన్జీవోల్లో అవగాహన పెరగడం, ఉద్యోగుల్లో ప్రశ్నించే వారు ఎక్కువవడంతో ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. ఆ ఒత్తిడితోనే ఏదో నామమాత్రంగా నోటిఫికేషన్ ఇచ్చి, ఎన్నికల జాబితా లేకుండానే, సభ్యత్వ నమోదు చేయకుండానే, ఎవరికీ సమాచారం లేకుండానే ఎన్నికలు నిర్వహించి తిరిగి పదవులను దక్కించుకోవాలని పలువురు కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏం లేకుండానే పోటీ అని చెప్పి ఉద్యోగులను పిచ్చోళ్లను చేయాలని చూస్తున్నారంటూ మండి పడుతున్నారు.

### ఆ నలుగురు చెప్పిందే వేదం..

మంచిర్యాల జిల్లాలని టీఎన్జీవో సంఘంలో ప్రస్తుతం పదవుల్లో ఉన్న నలుగురు చెప్పిందే వేదం అన్నట్లుగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాళ్లకే అన్ని పదవులు దక్కాలనే కుట్రలో భాగంగానే పావులు కదుపుతున్నట్లు ఎన్నికల హడావుడి బట్టి చూస్తే అర్థం అవుతున్నది. మంచిర్యాల జిల్లా కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న పొన్న మల్లయ్యకు మరో మూడు పదవులు ఉన్నాయి. ఆయనే స్టేట్ యూనియన్‌లో సెక్రటరీ, టీఎన్జీవోకు అనుబంధంగా ఉన్న స్టేట్ ఫారెస్ట్ ఎంప్లాయీస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా, టీఎన్జీవో జిల్లా ట్రెజరర్‌గా పదవుల్లో ఉన్నారు. ఇక్కడ కొస మెరుపు ఏమిటంటే ఇప్పుడు ఎన్నికలు నిర్వహించే ఆరు యూనిట్లలో చెన్నూర్, మంచిర్యాల యూనిట్ల ఎన్నికల అధికారిగా ఉండటం గమనార్హం. మిగిలిన నలుగురిలో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్‌లు ఉండటం, ఇతర డిపార్ట్‌మెంట్ వాళ్లకు అవకాశం ఇవ్వకపోడంతో ఎన్నికల విశ్వసనీయతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం అధ్యక్షుడైన గడియారం శ్రీహరి సైతం డిప్యూటీ తహసీల్దార్ కావడంతో ఆయనకు దగ్గరగా ఉన్న వారినే ఎన్నికల అధికారులుగా నియమించారని చెబుతున్నారు. ఓటర్ల జాబితా లేకుండా ఎన్నికలకు వెళ్లి ఎలాగోలా జిల్లా బాడీ పగ్గాలు తిరిగి దక్కించుకోవాలనే కుట్రల్లో భాగంగానే బై-లాను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా ఎన్నికలు నిర్వహిస్తున్న తీరుపై టీఎన్జీవో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి నాయకత్వం చొరవ తీసుకొని, నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



le 10 : PUBLICATION OF VOTERS LIST

In respect of unit elections, the list of members enrolled shall be furnished to the Election officer along with authorization letter.

Consequent on inclusions, deletion, claims and objections, the Election Officer shall publish final list of voters with his signature and seal (7) days prior to the date of Election. Claims and objections shall be disposed by the election officer with reference to the provisions of the constitution.

In respect of Branch Elections, the voters list shall be prepared by President / Secretary of the branch, in accordance with the resolutions of the concerned unit executives nominating council members. The names of President / Secretary of Units / Special Units, Council Member furnished by unit President Secretary and outgoing office bearers of District Branch.

The Election officer shall attest and publish the same, up on verification, (7) days prior to the date of Election.

In respect of Central Union Elections, the President / General Secretary shall consolidate the lists attested by the President / Secretary of the Branches / Special Branches, with the following modifications.

a) ... shall be included as per the proceedings issued by the Election officer.

b) Names of Council Member of the branch shall be included as per the resolution of the concerned branch communicated with the signature of the President / General Secretary.

c) Names of all the outgoing office bearers of Central Union shall be included.

యూనియన్ బైలాలో ఏడు రోజుల ముందే ఓటర్ల జాబితా



అవిశ్వాసానికి హాజరైన 21 మంది కౌన్సిలర్లు

## కాగజ్‌నగర్ బల్దియాలో నెగ్గిన అవిశ్వాసం

**21 మంది కౌన్సిలర్ల మద్దతు**

కాగజ్‌నగర్, జనవరి 20 : కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్‌కుమార్‌పై శనివారం ప్రవేశ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తు మధ్య కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా 23 మంది కౌన్సిలర్లకుగాను.. 21 మంది కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసినట్లు ప్రిసైడింగ్ అధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. అవిశ్వాస తీర్మాన రిపోర్టును కలెక్టర్‌కు పంపిస్తామని, కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. అనంతరం కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాలతో పట్టణ అబివృద్ధి గాడితప్పిందని, మాజీ ఎమ్మెల్యే కోనప్ప సహకారంతో అవిశ్వాస తీర్మానం పెట్టామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి మాజీ ఎమ్మెల్యే కోనప్పను మర్యాద పూర్వకంగా కలిశారు. కౌన్సిలర్లను ఆయన శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఏవో ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది క్రాంతి, బాపు ఉన్నారు.

# రెండో విడుత గొర్రెలిచ్చేనా?

- కేసీఆర్ సర్కారులో మొదటి విడుతలో 2891 మందికి యూనిట్లు
- డీడీలు కట్టి ఎదురుచూస్తున్న 562 మంది
- పథకం కొనసాగింపుపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్
- ఆందోళనలో గొల్ల కుర్మలు



మొదటి విడుతలో అందించిన గొర్రెలతో ఉపాధి పొందుతున్న లబ్ధిదారులు(ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : గొల్ల కుర్మలకు జీవనాధారమైన గొర్రెల పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా..లేదా అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. కుల వృత్తులకు జీవం పోసిన కేసీఆర్ సర్కారు.. గొల్ల కుర్మల సంక్షేమం కోసం గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో గొల్ల కుర్మలు ఎంత మంది ఉన్నారనే దానిపై సర్వేలు నిర్వహించింది. 2017లో 4,404 మంది అర్హులను గుర్తించింది. మొదటి విడుతలో 2891 మందికి గొర్రెల యూనిట్లు అందించింది. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున పంపిణీ చేసింది. ఆ తర్వాత రెండో విడుతలో మిగతా లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, కరోనా తదితర కారణాలతో జాప్యమైంది. దీంతో 1513 మందికి ఇప్పటి వరకు గొర్రెల యూనిట్లు అందలేదు. ఈ పథకం విలువ రూ. లక్షా 75 వేలు కాగా, లబ్ధిదారులు రూ. 43,750 డీడీ రూపంలో చెల్లిస్తే మిగతా రూ. లక్షా 31 వేల 250 ప్రభుత్వం సబ్సిడీని కలిపి గొర్రెలను అందించాల్సి ఉంది.

### డీడీలు కట్టిన 562 మంది

ఇక రెండో విడుతలో గొర్రెలు వస్తాయని భావించిన 562 మంది లబ్ధిదారులు రూ. 43,750 చొప్పున డీడీలు కట్టారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా 230 మందికి గొర్రెలను అందించింది. ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల మిగతా 332 మందికి గొర్రెలు పంపిణీ చేయలేదు. వీరికి కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెలను అందిస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇక గొర్రెల పథకానికి అర్హులైన 951 మంది డీడీ కట్టలేదు. రెండో విడుత గొర్రెల పంపిణీ సందిగ్ధంలో ఉండగా మిగతా లబ్ధిదారులు డీడీలు కట్టేందుకు వెనుకాడుతున్నారు. రెండో విడుతలో డీడీలు కట్టిన వారి డబ్బులు తిరిగి ఇస్తారా.. లేక గొర్రెలను అందిస్తారా అనేదానిపై స్పష్టత కరువైంది.



కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

## విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

**మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్**

వేమనపల్లి, జనవరి 20 : విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. శనివారం మండలంలోని నీల్వాయి కస్తూర్బాగాంధీ విద్యాలయం, జడ్పీ హైస్కూల్‌ను ఆయన పరిశీలించారు. చదువుతోనే భవిష్యత్ బాగుంటుందని, ప్రతి ఒక్కరూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, సర్పంచు గాలి మధు, ఎంఈవో తిరుపతిరెడ్డి, వైద్యాధికారి రాజేశ్, ఏపీవో సత్యప్రసాద్, వెటర్నరీ వైద్యురాలు అరుణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సువర్ణ, నీల్వాయి హెచ్ఎం గిరిధర్ రెడ్డి, కస్తూర్బా ప్రిన్సిపాల్ మయూరి, పంచాయతీ కార్యదర్శులు అశోక్ పాల్గొన్నారు.

# ఇట్లయితే తాగు నీరెట్లా..!

- ముందుచూపు లేనితనంతో పగిలిపోతున్న పైపులైన్లు
- కలుషితనీటి భయం



హమాలీవాడ చర్చి ప్రాంతంలో పైపులైను పగలడంతో మరమ్మతు కోసం తవ్విన ప్రదేశం

మంచిర్యాలటౌన్, జనవరి 20 : అధికారుల ముందుచూపులేని తనంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. మంచిర్యాల పట్టణ ప్రజలకు ప్రతి రోజూ తాగునీరందించాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు.. మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో సమావేశమై లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు మిషన్ భగీరథ అధికారులు నిర్మించిన సంప్ నుంచి జలగుట్ట పైనున్న ట్యాంకులోకి నీటిని ఎక్కించి.. అక్కడి నుంచి పట్టణంలోని ట్యాంకులకు గ్రావిటీ ద్వారా పంపింగ్ చేస్తున్నారు. ముల్కల్ల పంప్‌హౌస్ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని ఇన్ని రోజులు తట్టుకున్న ఏసీ పాత పైపులు.. ప్రస్తుతం గ్రావిటీతో వస్తున్న నీటి ప్రవాహాన్ని మాత్రం తట్టుకోలేక పగిలిపోతున్నాయి. గడిచిన నాలుగురోజుల్లో ఇప్పటికే మూడు ప్రాంతాల్లో పైపులు పగిలిపోయాయి. వాటిని మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. కాగా.. మిషన్ భగీరథ అధికారులు డీఐ పైపులు వేసి దాదాపు నాలుగేళ్లు అవుతుంది. త్వరలోనే వాటికి కనెక్షన్‌లు ఇస్తామని చెబుతున్నారు. ఓ పక్క పాతపైపులు పగిలిపోవడం, ఇప్పటికే వేసి ఉన్న మిషన్ భగీరథ పైపులు పనిచేస్తాయో లేదో తెలియని పరిస్థితుల నేపథ్యంలో తాగు నీరందేదెలా అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఇక పైపులు పగిలిన చోట మరమ్మతులకోసం రోజుల తరబడి తెరిచి ఉంచడం వల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో సీవోఈ విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లిరూరల్, జనవరి 20 : డిసెంబర్ 24న నిర్వహించిన అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ(బెంగళూర్) ప్రవేశపరీక్షలో బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)కి చెందిన ఆరుగురు విద్యార్థులు పుల్లూరి దీపక్, నగమళ్ల గణేశ్, గొల్ల బలరాముడు, గడపల సుమేద్, బత్తుల మధు, బండారి శివమూర్తి ప్రతిభ చూపి అర్హత సాధించారు. అంతర్జాతీయ, జాతీయస్థాయిలో వివిధ దేశాలు, రాష్ట్రాల్లోని కళాశాలల నుంచి యూనివర్సిటీ అడ్మిషన్ కోసం తీవ్ర స్థాయిలో పోటీ ఉంటుంది. రాతపరీక్షతో పాటు ఆన్‌లైన్‌లో మౌఖిక పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. ఇంతటి పోటీ ఉన్న ఈ ప్రవేశపరీక్షలో మొదటి దశలో ప్రతిభ చూపి ఆన్‌లైన్ ఇంటర్వ్యూకి ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించడంపై ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ ఫోన్‌లో విద్యార్థులను అభినందించారు. శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అధ్యాపకులతో కలిసి ఆరుగురు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, జేవీపీ కొక్కుల రాజేశ్వర్, హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ కో ఆర్డినేటర్ ఆవునూరి రవి, అకాడమిక్ కో ఆర్డినేటర్ నాగిని శ్రీరామవర్మ, అధ్యాపకులు కిరణ్,అనిరుధ్, చందా లక్ష్మీనారాయణ, ఆకినేపల్లి రాజేశ్, రఫీ, మిట్ట రమేశ్, శాతరాజు తిరుపతి, రాకేశ్, సమేందర్, తేజశ్వి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులు




కాగజ్‌నగర్ : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో అశోక్‌కుమార్

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్/మంచిర్యాల అర్బన్, జనవరి 20 : కాగజ్‌నగర్ జవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో 1079 మంది విద్యార్థులకుగాను 805, ఆదిలాబాద్ జిల్లాలో 983 మందికిగాను 819 మంది, మంచిర్యాల జిల్లాలో 1188 మందికి 979 మంది, నిర్మల్ జిల్లాలో 1208 మందికి 1055 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 4458 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 3658 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

## వన్యప్రాణులకు హాని తలపెడితే చర్యలు

- జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ డేబ్రేవాల్
- పెంచికల్‌పేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులకు అవగాహన



రైతులకు నష్టపరిహారం చెక్కులు అందజేస్తున్న డీఎఫ్‌వో నీరజ్ కుమార్ డేబ్రేవాల్

పెంచికల్‌పేట్, జనవరి 20 : వన్యప్రాణులకు హాని తలపెడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ డేబ్రేవాల్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అటవీ సంపద, వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా పశుకాపరులు దట్టమైన అడవిలోకి వెళ్లకూడదన్నారు. అటవీ ప్రాంతంలోనున్న విద్యుత్‌లైన్‌లను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. పులుల సంరక్షణకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడతామని, ఎలాంటి హానితలపెట్టబోమని వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పులి దాడిలో చనిపోయిన పశువుల యజమానులకు నష్టపరిహారం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్ఐ ప్రభాకర్, పశు వైద్యాధికారి రాకేశ్, బెజ్జూర్ ఎఫ్ఆర్వో దయాకర్, పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్, సర్పంచులు జాజిమొగ్గ శ్రీనివాస్, దుర్గం రాజన్న, చంద్రమౌళి, దేవాజీ, ఎంపీటీసీలు రాజన్న శ్రీవిద్య, లావణ్య, డీఆర్వో ప్రభాకర్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.